ఐఐటీ మద్రాస్ బెస్ట్

- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఓవరాల్ క్యాటగిరీలో టాప్ ప్లేస్
- వరుసగా ఆరో ఏడాది అగ్రస్థానం
- బెస్ట్ యూనివర్సిటీగా ఐఐఎస్‌సీ

న్యూఢిల్లీ, ఆగస్టు 12: 'నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్' (ఎన్ఐఆర్ఎఫ్) తాజా ర్యాంకుల్లో ఐఐటీ-మద్రాస్ మరోమారు టాప్‌లో నిలిచింది. కేంద్ర విద్యాశాఖ పరిధిలోని 'ఎన్ఐఆర్ఎఫ్', దేశంలోని ఉన్నత విద్యా సంస్థల పనితీరు ఆధారంగా ఏటా వివిధ విభాగాల్లో టాప్-10 విద్యా సంస్థల పేర్లను విడుదల చేస్తున్నది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 10,885 విద్యా సంస్థల పనితీరును పరిశీలించి, 2024 ఏడాదికి ర్యాంకులను సోమవారం వెలువరించింది. 'ఓవరాల్', 'ఇంజినీరింగ్' రెండు విభాగాల్లోనూ వరుసగా ఆరోసారి ఐఐటీ-మద్రాస్ మొదటి ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. 'ఓవరాల్' క్యాటగిరిలో బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ) రెండో స్థానంలో నిలవగా, యూనివర్సిటీల విభాగంలో ఐఐఎస్‌సీ వరుసగా 9వ సారి టాప్ ప్లేస్‌లో నిలిచింది.

ఓవరాల్‌గా.. టాప్-5

1. ఐఐటీ-మద్రాస్
2. ఐఐఎస్‌సీ-బెంగళూరు
3. ఐఐటీ-బాంబే
4. ఐఐటీ-ఢిల్లీ
5. ఐఐటీ-కాన్పూర్

టాప్-5- ఇంజినీరింగ్

1. ఐఐటీ-మద్రాస్
2. ఐఐటీ-ఢిల్లీ
3. ఐఐటీ-బాంబే
4. ఐఐటీ-కాన్పూర్
5. ఐఐటీ-ఖరగ్‌పూర్

టాప్-5- మేనేజ్‌మెంట్

1. ఐఐఎం-అహ్మదాబాద్
2. ఐఐఎం-బెంగళూరు
3. ఐఐఎం-కోజికోడ్
4. ఐఐఎం-ఢిల్లీ
5. ఐఐఎం-కలకత్తా

టాప్-5-మెడికల్

1. ఎయిమ్స్-ఢిల్లీ
2. పీజీఐఎంఈఆర్-చండీగఢ్
3. సీఎంసీ-వెల్లూర్
4. ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్-బెంగళూరు
5. జేఐపీఎంఈఆర్ -పుదుచ్చేరి

తెలంగాణ విద్యాసంస్థల డీలా

- గతేడాది కంటే తగ్గిన ర్యాంకులు
- ఉస్మానియా యూనివర్సిటీకి 70, జేఎన్టీయూహెచ్‌కు 88వ ర్యాంకులు
- ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఓయూకు 6వ స్థానం

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా విద్యాసంస్థలకు ఇచ్చే నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకుల్లో తెలంగాణ విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు వెనుకబడ్డాయి. చారిత్రక ఉస్మానియా వర్సిటీ, సాంకేతిక విద్యలో దేశంలోనే తొలి వర్సిటీ అయిన జేఎన్‌టీయూహెచ్‌ల ర్యాంకులు దిగజారాయి. ఇతర వర్సిటీలదీ అదే పరిస్థితి. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, కోర్సుల నాణ్యత, ప్లేస్‌మెంట్స్, ఆర్థిక వనరులు, పరిశోధన వంటి అంశాల ఆధారంగా ఈ ర్యాంకులు కేటాయించారు. కేవలం తెలంగాణకు చెందిన మూడు సంస్థలు మాత్రమే దేశంలో పలు విభాగాల్లో టాప్-10 జాబితాలో నిలిచాయి. ఇన్నోవేషన్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఐఐటీ హైదరాబాద్ 3వ ర్యాంకు. ఫార్మసీలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్(నైపర్) 2వ ర్యాంకు, న్యాయ విద్యాసంస్థల్లో నల్సార్ లా యూనివర్సిటీ 3వ ర్యాంకు సాధించాయి.

తగ్గిన ఓయూ, జేఎన్టీయూ ర్యాంకులు

ఓవరాల్ క్యాటగిరిలో ఉస్మానియా వర్సిటీకి 2023లో 64వ ర్యాంకు వస్తే, ఈసారి ఇది 70కి పడిపోయింది. విశ్వవిద్యాలయాల వారీగా నిరుడు 36 ర్యాంకు ఉంటే, ఈసారి 43కు పడిపోయింది. జేఎన్టీయూ హైదరాబాద్‌కు గత ఏడాది 83 ఉంటే, ఈసారి 88కు పడిపోయింది. ఐఐఐటీ హైదరాబాద్ ర్యాంకు మెరుగయ్యింది. గతంలో 84 ర్యాంకు రాగా, ఈసారి 74వ ర్యాంకు దక్కింది. కళాశాలల స్థాయిలో వందలోపు ఏ ఒక్క కళాశాలకూ చోటు దక్కలేదు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో ఈసారి కొత్తగా రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీలు, స్కిల్ యూనివర్శిటీలు, ఓపెన్ యూనివర్శిటీలకు కూడా ర్యాంకులు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీల విభాగంలో 50 యూనివర్శిటీలు పోటీపడగా ఉస్మానియా విశ్వవిద్యాలయానికి 6వ స్థానం లభించింది.

రాష్ట్రంలోని ప్రధాన విద్యాసంస్థల ర్యాంకులు

ఓవరాల్ ర్యాంకులు..

సంస్థ	2023	2024
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్	21	25
ఎన్ఐటీ వరంగల్	53	53
ఉస్మానియా యూనివర్సిటీ	64	70
ఐఐటీ హైదరాబాద్	14	12

ఇంజినీరింగ్ విద్యలో...

ఐఐటీ హైదరాబాద్	8	8
ఎన్ఐటీ వరంగల్	21	21
ట్రిపుల్ ఐటీ హైదరాబాద్	45	47
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్	71	70
జేఎన్‌టీయూహెచ్	83	88
ఎస్ఆర్ యూనివర్సిటీ, వరంగల్	98	98

విశ్వవిద్యాలయాల వారీగా..

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్	10	17
ఉస్మానియా యూనివర్సిటీ	36	43
ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్	84	74

వర్షపాతాన్ని కచ్చితంగా అంచనా వేసే టెక్నాలజీ

భువనేశ్వర్, ఆగస్టు 12: వర్షపాతాన్ని కచ్చితంగా అంచనావేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసినట్టు 'ఐఐటీ-భువనేశ్వర్' ప్రకటించింది. వెదర్ రిసెర్చ్, ఫోర్‌కాస్టింగ్ (డబ్ల్యూఆర్ఎఫ్) మోడల్‌లో వచ్చిన అవుట్‌పుట్‌ను డీప్ లెర్నింగ్ మోడల్‌తో అనుసంధానం చేయటం ద్వారా కొత్త సాంకేతికతను రూపొందించినట్టు ఓ ప్రకటనలో తెలిపింది. పెద్ద ఎత్తున వరదలు సంభవించే అస్సాం, భారీగా వర్షాలు కురిసే ఒడిశాలలో కొత్త టెక్నాలజీ పనితీరును అధ్యయనం చేసినట్టు తెలిపింది.

16న 'ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్' ప్రయోగం

బెంగళూరు, ఆగస్టు 12: ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ ఈవోఎస్-08 ప్రయోగం వాయిదా పడింది. ఆగస్టు 16న ఈ ప్రయోగాన్ని చేపడుతున్నట్టు ఇస్రో సోమవారం 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. 175.5 కిలోగ్రాములున్న ఈ శాటిలైట్ అంతరిక్షంలో ఒక ఏడాది కాలం తన సేవల్ని అందిస్తుంది. భూమిపై శాటిలైట్ ఆధారిత నిఘా, విపత్తు, పర్యావరణ పర్యవేక్షణ, అగ్ని ప్రమాదాలు, పరిశ్రమలు, విద్యుత్ ప్లాంట్లలో విపత్తుల నిర్వహణకు అవసరమైన సమాచారాన్ని ఈవోఎస్-08 శాటిలైట్ అందిస్తుంది.

1.3 లక్షల మంది టెకీలపై వేటు!

- ఈ ఏడాది ఇప్పటి వరకు ఉద్యోగాలు కోల్పోయిన వారి సంఖ్య ఇది
- ఐటీ రంగంలో ఆగని తొలగింపులు

న్యూఢిల్లీ, ఆగస్టు 12: టెక్ ఇండస్ట్రీలో ఉద్యోగుల తొలగింపుల పర్వం కొనసాగుతున్నది. ఈ ఏడాది ఇప్పటి వరకు 1,30,000 మందికి పైగా ఐటీ ఉద్యోగులు తమ ఉద్యోగాలు కోల్పోయారు. గత కొన్నాళ్లుగా కొనసాగుతున్న ఈ లేఆఫ్‌ల ట్రెండ్ ఇప్పట్లో నెమ్మదించేలా కనిపించడం లేదు. ఆర్థికపరమైన సవాళ్లు, పోటీ ఒత్తిళ్లతో పాటు కొత్త మార్కెట్ మార్పులను అనుసరించాల్సి రావడం వంటివి ఉద్యోగుల తొలగింపునకు ప్రధాన కారణాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు. లేఆఫ్స్.ఎఫ్‌వైఐ డాటా ప్రకారం ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 397 కంపెనీల్లో 1,30,482 మంది ఉద్యోగాలు పోయాయి. మరోవైపు పలు కంపెనీలు ఉద్యోగాల కోత బాటలో నడుస్తున్నాయి. మరో రౌండ్ లేఆఫ్‌లకు సిస్కో కంపెనీ సిద్ధమవుతున్నట్టు నివేదికలు వస్తున్నాయి. ఈ ఏడాది మొదట్లో చేపట్టిన 4 వేల ఉద్యోగాల కంటే ఈ దఫా అధికంగా కోతలు ఉండే అవకాశం ఉన్నదని రాయిటర్స్ నివేదించింది. సైబర్ సెక్యూరిటీ, ఏఐ వంటి అధిక వృద్ధి ఉండే రంగాలపై దృష్టి సారించే వ్యూహంలో భాగంగా సిస్కో ఈ చర్య చేపడుతున్నట్టు తెలిసింది. జూలైలో ఉద్యోగుల సంఖ్యను గణనీయంగా తగ్గించుకొనే ప్లాన్‌ను చిప్ తయారీ సంస్థ ఇంటెల్ ప్రకటించింది. 2025 నాటికి కంపెనీ స్థిరత్వం సాధించేందుకు వ్యయ తగ్గింపులో భాగంగా ప్రస్తుతం కంపెనీలో ఉన్న శ్రామిక శక్తిలో 15 శాతానికి పైగా అంటే 15,000 మంది పైగా ఉద్యోగులను ఇంటికి పంపే యోచనలో ఉన్నట్టు సమాచారం.

భారతీయ కంపెనీల్లోనూ..

మైక్రోసాఫ్ట్‌లో గత రెండు నెలల కాలంలో నిశ్శబ్దంగా దాదాపు వెయ్యి మందిని తొలగించినట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అన్‌అకాడమీ, వేకూల్ వంటి భారత కంపెనీలు లేఫ్‌ల బాటలో పయనిస్తున్నాయి. ఉద్యోగుల తగ్గింపునకు సంబంధించి ఆయా సంస్థలు ఇప్పటికే ప్రకటనలు చేశాయి. అన్‌అకాడమీ 250 మందిని, వేకూల్ 200 మందిని తొలగించనున్నట్టు ప్రకటించాయి. మరోవైపు ఐటీ ఇండస్ట్రీతో పాటు ఇతర రంగాల్లోనూ ఈ ట్రెండ్ కొనసాగుతున్నది. భారత్‌లోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో దాదాపు 42,000 ఉద్యోగులకు ఉద్వాసన పలికారు.

ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల తొలగింపు ఇలా..

	ఉద్యోగాల కోతలు	కంపెనీలు
2022	1.65 లక్షలు	1,065
2023	2.62 లక్షలు	1,190
2024	1.30 లక్షలు	397

సెబీ చీఫ్‌పై మరిన్ని ఆరోపణలు

- బెర్ముడా/మారిషస్ ఫండ్స్‌లో పెట్టుబడులు ఉన్నాయని ఆమె బహిరంగంగా ఒప్పుకొన్నారు
- తన కన్సల్టింగ్ సంస్థల క్లయింట్ల వివరాలు వెల్లడించాలి
- మాధవి పురీ బచ్‌పై హిండెన్‌బర్గ్ మళ్లీ ఆరోపణలు

న్యూఢిల్లీ, ఆగస్టు 12: తమ ఆరోపణలు ఖండిస్తూ సెబీ చైర్‌పర్సన్ మాధవి పురీ బచ్, ఆమె భర్త ధావన్ చేసిన సంయుక్త ప్రకటన పలు కొత్త సంక్లిష్ట ప్రశ్నలు లేవనెత్తుతున్నదని అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ పేర్కొన్నది. మాధవి బచ్ స్పందన ద్వారా అనామక బెర్ముడా/మారిషస్ ఫండ్స్‌లో పెట్టుబడులు ఉన్నాయన్న విషయాన్ని బహిరంగంగా ధ్రువీకరిస్తున్నారని పేర్కొన్నది. హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరాధారమని, సెబీ విశ్వసనీయతను దెబ్బతీయడంతోపాటు వ్యక్తిత్వ హననానికి ప్రయత్నిస్తున్నట్టు ఉన్నాయని సెబీ చీఫ్ మాధవి బచ్ ఆదివారం ప్రకటన విడుదల చేసిన కొద్ది గంటల తర్వాతనే హిండెన్‌బర్గ్ ఎక్స్‌లో వరుసగా పలు పోస్టులు పెట్టింది. వారి స్పందనలో పలు ముఖ్యమైన అంగీకారాలు ఉండటంతోపాటు కొత్త ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని పేర్కొన్నది. బెర్ముడా/మారిషస్ ఫండ్స్‌లో పెట్టుబడులను తన భర్త చిన్ననాటి స్నేహితుడు నడుపుతున్నాడని ఆమె ధ్రువీకరించారని, ఆయన ఆ సమయంలో అదానీ గ్రూపులో డైరెక్టర్‌గా పనిచేస్తున్నారని వెల్లడించింది. భారత్‌తో పాటు సింగపూర్‌లోని ఆమె కన్సల్టింగ్ సంస్థలు డీల్ చేస్తున్న క్లయింట్ల వివరాలను స్పష్టంగా వెల్లడించాలని హిండెన్‌బర్గ్ పేర్కొన్నది. 2024, మార్చి 31 నాటికి తాజా షేర్ హోల్డింగ్ లిస్టు ప్రకారం 2017లో తాను సెబీ సభ్యురాలిగా అయిన తర్వాత తన భర్త 2019లో టేకోవర్ చేసిన అగోరా అడ్వైజరీ లిమిటెడ్(ఇండియా)లో 99% మాధవి బచ్ పేరుపైనే ఉన్నాయని, ప్రస్తుతం ఈ సంస్థ యాక్టివ్‌గానే ఉన్నదని, లక్షల రూపాయల మేర కన్సల్టింగ్ ఆదాయం పొందుతున్నదని హిండెన్‌బర్గ్ తెలిపింది. అగోరా పార్ట్నర్స్ సింగపూర్‌లో 2022, మార్చి 16 వరకు 100% షేర్ హోల్డర్‌గా ఆమె ఉన్నారని పేర్కొన్నది. సెబీ చైర్‌పర్సన్‌గా నియమితులైన రెండు వారాల తర్వాతనే తన షేర్లను భర్త పేరుపై బదిలీ చేశారని వెల్లడించింది. సెబీ చైర్‌పర్సన్‌గా ఉన్నప్పుడు మాధవి బచ్ తన భర్త పేరుపై ఏ ఇతర వ్యాపారాల్లో ఉన్నారనే ప్రశ్నలు వస్తున్నాయని హిండెన్‌బర్గ్ పేర్కొన్నది.

జేపీసీ వేయకుంటే దేశవ్యాప్త ఆందోళనలు

సెబీ చీఫ్‌పై ఆరోపణలు తీవ్రమైన అంశమని, జేపీసీ దర్యాప్తునకు కేంద్రం అంగీకరించకుంటే దేశవ్యాప్త ఆందోళనలు చేస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ హెచ్చరించారు. అదానీ గ్రూపునకు ప్రధాని మోదీ సహకరిస్తున్నారని ఆరోపించారు. మోదీ సర్కార్ చెప్పే 'అమృత్‌కాల్'లో ఏ సంస్థ కూడా పవిత్రంగా లేకుండా పోయిందని జైరాం రమేశ్ విమర్శించారు. అదానీ గ్రూపు ఆర్థిక అవకతవలపై దర్యాప్తు విషయంలో సెబీ రాజీపడినట్టు కనిపిస్తున్న క్రమంలో దర్యాప్తును సీబీఐ లేదా సిట్‌కు అప్పగించాలన్నారు. సెబీ సమగ్రతను పునరుద్ధరించేందుకు చైర్‌పర్సన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక వ్యవస్థను బలహీనపర్చే యత్నాలు

జేపీసీ వేయాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను బీజేపీ నేత, మాజీ కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ తిరస్కరించారు. భారత ఆర్థిక వ్యవస్థ బలహీనపడాలని, స్టాక్ మార్కెట్ పడిపోవాలని కాంగ్రెస్ కోరుకుంటున్నదని ఆరోపించారు. పెద్ద కుట్రలోనే భాగంగా హిండెన్‌బర్గ్ ఆరోపణలు, విపక్షాలు విమర్శలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ, మోదీ సర్కార్‌ను అస్థిరపరిచే ప్రయత్నాల వెనుక హిండెన్‌బర్గ్‌లో ఇన్వెస్టర్‌గా ఉన్న బిలియనీర్ జార్జి సోరోస్ ఉన్నారని ఆరోపించారు.

ఓఎస్‌లో లోపాలు గుర్తిస్తే మిలియన్ డాలర్లు

ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శామ్‌సంగ్

న్యూఢిల్లీ: ఎవరికీ అన్యాయం చేయకుండా మిలియనీర్ కావాలనుకుంటున్నారా? ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ సరికొత్త బౌంటీ ఆఫర్ మీ కోసమే. మీరు చేయాల్సిందల్లా దాని ఆపరేటింగ్ సిస్టం (ఓఎస్)లోని అతిపెద్ద సమస్యను కనిపెట్టడమే. ఈ పనిని విజయవంతంగా చేస్తే మిలియన్ డాలర్లు మీ సొంతమవుతాయి. మొబైల్ సెక్యూరిటీ ప్రోగ్రాంలో భాగంగా శాంసంగ్ ఈ ఆఫర్‌ను ప్రకటించింది. డేటాను వెలికి తీయడం, పరికరాలను అన్‌లాక్ చేయడం, అనధికారిక అప్లికేషన్లను ఇన్‌స్టాల్ చేయడం వంటి భద్రతాపరమైన లోపాలతోపాటు ఓఎస్ దుర్బలత్వానికి సంబంధించిన సమస్యలను గుర్తించిన వారికి ఈ రివార్డు ఇవ్వనున్నట్టు శాంసంగ్ తెలిపింది. కనిపెట్టిన లోపం తీవ్రత ఆధారంగా రివార్డు ఉంటుంది. శాంసంగ్ హార్డ్‌వేర్ సెక్యూరిటీ సిస్టంలోని సరికొత్త నాక్స్ వాల్ట్ విజయవంతంగా హ్యాక్ చేయడం, రిమోట్ కోడ్‌ను ఎగ్జిక్యూట్ చేయడం ద్వారా టాప్ ప్రైజ్ అయిన మిలియన్ డాలర్లు సొంతం చేసుకోవచ్చు. అలాగే, అన్‌లాక్ చేయడం, డేటాను దొంగిలించడం, గెలాక్సీ స్టోర్ నుంచి కాకుండా ఇతర సోర్సుల నుంచి యాప్‌లను ఇన్‌స్టాల్ చేయడం వంటి వాటికి కూడా అవార్డులు ప్రకటించింది.

దేశవ్యాప్తంగా వైద్యుల ఆందోళన

- హత్యాచార ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్
- రాష్ట్రాల్లో వైద్య సేవలకు అంతరాయం

కోల్‌కతా/న్యూఢిల్లీ, ఆగస్టు 12: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా ది ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఫోర్డా) ఆధ్వర్యంలో ప్రభుత్వ దవాఖానల రెసిడెంట్ డాక్టర్లు సోమవారం ఢిల్లీతో సహా దేశవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టారు. దీంతో పలు రాష్ట్రాల్లోని దవాఖానల్లో పలు వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. ఓపీ సేవలు, అత్యవసరం కాని సర్జరీలు నిలిచిపోయాయి. నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఢిల్లీలోని ఎయిమ్స్, ఆర్ఎంఎల్ ఇతర ప్రభుత్వ దవాఖానల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. జూనియర్ డాక్టర్ల విధుల బహిష్కరణతో పశ్చిమబెంగాల్ వ్యాప్తంగా దవాఖానల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. తమ సహచర వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జి చేత నిష్పాక్షిక దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. బాధితురాలి పోస్టుమార్టం నివేదికతోపాటు హత్యాచారం జరిగిన మెడికల్ కాలేజీ సెమినార్ హాల్ సమీపంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అన్ని దవాఖానల్లో వైద్యుల భద్రతకు కేంద్రం ప్రొటోకాల్ విడుదల చేయాలని ఫోర్డా డిమాండ్ చేసింది.

నాగర్‌కర్నూల్‌లో జూడాల కొవ్వొత్తుల ర్యాలీ

ఆదివారానికి పరిష్కరించకుంటే సీబీఐకి

వచ్చే ఆదివారం నాటికి పోలీసులు కేసును పరిష్కరించలేకుంటే కేసును సీబీఐకి బదిలీ చేస్తామని సీఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు. సోమవారం బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించారు. నిందితులకు మరణశిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. కాగా, బాధితురాలు ఆత్మహత్య చేసుకుని మరణించిందని తొలుత దవాఖాన అసిస్టెంట్ సూపరింటెండెంట్ బాధితురాలి కుటుంబానికి ఫోన్ చేసి తెలిపినట్టు తెలిసింది. దీంతో అతడిని పోలీసులు విచారణకు పిలిచారు.

నీకు కూడా అలాగే జరుగుతుంది..

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌కు ఏం జరిగిందో నీకూ అదే జరుగుతుందని శుక్రవారం రాత్రి బెంగాల్‌లోని పుర్బ బర్ధమాన్ జిల్లాలో ఓ పౌర వలంటీర్ ఓ ప్రభుత్వ దవాఖాన వైద్యురాలిని బెదిరించడం సంచలనంగా మారింది.

గూగుల్ సర్వీసుల్లో అంతరాయం

న్యూఢిల్లీ, ఆగస్టు 12: ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో సోమవారం గూగుల్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. జీమెయిల్, సెర్చ్, గూగుల్ డ్రైవ్, యూట్యూబ్ ఇతర సర్వీసులు నిలిచిపోయాయంటూ గూగుల్ యూజర్లు ఫిర్యాదులు చేశారు. అమెరికాలో ఉదయం 9 గంటలకు గూగుల్ సర్వీసులు ప్రభావితమైనట్టు తెలుస్తున్నది. సర్వీసులు నిలిచిపోవడానికి గల కారణాలు తెలియరాలేదు. లాస్‌ఏంజెల్స్, న్యూయార్క్ సిటీలో సర్వీసుల అంతరాయం ఎక్కువగా జరిగినట్టు డౌన్‌డిటెక్టర్ వెబ్‌సైట్ మ్యాప్ పేర్కొన్నది. ఈ వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో వచ్చే అంతరాయాలను పర్యవేక్షిస్తుంటుంది. గూగుల్ సేవల అంతరాయానికి సంబంధించి అమెరికా, యూకే, ఐరోపా, ఆసియా, దక్షిణ అమెరికా దేశాలకు చెందిన యూజర్లు తమ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టులు పెట్టారు. కొంత సేపటికే సర్వీసులు యథాతథంగా పనిచేస్తున్నాయని కొంత మంది పేర్కొన్నారు. కాగా, ఈ అంతరాయానికి సంబంధించి గూగుల్ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇటీవల క్రౌడ్ స్ట్రైయిక్ కారణంగా విండోస్‌లో తీవ్ర సమస్య తలెత్తిన నేపథ్యంలో తాజాగా గూగుల్ సమస్య ఎదురుకావడం గమనార్హం.

టీటీడీకి 21 కోట్ల విరాళం

తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానానికి పంజాబ్ పారిశ్రామికవేత్త రాజిందర్ గుప్తా భారీ విరాళం ఇచ్చారు. టీటీడీ ఆదివారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ప్రాణాంతక వ్యాధులతో బాధపడే పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించే ఎస్‌వీ ప్రాణదాన ట్రస్ట్‌కు ఆయన రూ.21 కోట్లు విరాళం ఇచ్చారు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి చెక్కును అందజేశారు. టీటీడీ నిర్వహిస్తున్న దవాఖానలు, ప్రసూతి దవాఖానల్లో ఎస్‌వీ ప్రాణదాన ట్రస్ట్ పథకం అందుబాటులో ఉంది.

బ్రాడ్‌కాస్టింగ్ బిల్లుపై వెనక్కుతగ్గిన కేంద్రం

సంప్రదింపుల తర్వాత కొత్త ముసాయిదా

న్యూఢిల్లీ, ఆగస్టు 12: ప్రసార సేవల నియంత్రణ బిల్లుపై కేంద్రం వెనక్కు తగ్గింది. ఇప్పటికే ప్రజలకు అందుబాటులో ఉన్న ముసాయిదాపై డిజిపబ్, ఎడిటర్స్ గిల్డ్ వంటి సంస్థల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. ఈ ముసాయిదా తయారీలో డిజిటల్ మీడియా సంస్థలు, సామాజిక సంస్థలను సంప్రదించలేదని ఆరోపించాయి. దీంతో కేంద్ర సమాచార, ప్రసార శాఖ సోమవారం కీలక ప్రకటన చేసింది. ముసాయిదాపై అక్టోబరు 15 వరకు సంప్రదింపులు జరుపుతామని, సూచనలు తీసుకుంటామని ప్రకటించింది. సంప్రదింపుల తర్వాత కొత్త ముసాయిదాను ప్రచురిస్తామని పేర్కొన్నది. కాగా, ఈ ముసాయిదా డిజిటల్ మీడియా, సోషల్ మీడియా ద్వారా వార్తల ప్రసారంపై ఆంక్షలు విధించేలా, ఇండిపెండెంట్ జర్నలిస్టుల గొంతు నొక్కేలా ఉందనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే.

2036 నాటికి స్త్రీ, పురుష నిష్పత్తి మెరుగుదల

న్యూఢిల్లీ: మన దేశంలో స్త్రీ, పురుష సమానత్వంలో ఆశాజనక ధోరణి కనిపిస్తున్నదని కేంద్ర గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ సోమవారం తెలిపింది. 2036నాటికి ప్రతి 1,000 మంది పురుషులకు 952 మంది మహిళలు ఉంటారని అంచనా వేసింది. 2011నాటి లెక్కల ప్రకారం, ప్రతి వెయ్యి మంది పురుషులకు 943 మంది మహిళలు ఉండేవారని తెలిపింది. 2011నాటి జనాభాలో మహిళల సంఖ్యతో పోల్చితే, 2036లో ఎక్కువ మంది మహిళలు ఉంటారని అంచనా వేసింది. 2011నాటి జనాభాలో 48.5 శాతం మంది మహిళలు ఉన్నారని, 2036నాటికి జనాభా 152.2 కోట్లకు చేరుతుందని, దీనిలో మహిళల జనాభా 48.8 శాతానికి పెరుగుతుందని వివరించింది. 15 ఏళ్ల లోపు బాలల సంఖ్య 2011లో కన్నా 2036లో తగ్గుతుందని, సంతానోత్పత్తి తగ్గడమే దీనికి కారణమని పేర్కొంది.

బీహార్ గుడిలో తొక్కిసలాట

ఏడుగురి మృతి

జహానాబాద్: బీహార్‌లోని జహానాబాద్ జిల్లాలో ఉన్న బాబా సిద్ధేశ్వర్ నాథ్ దేవాలయంలో ఆదివారం రాత్రి 11.30 గంటలకు తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు మహిళలు సహా ఏడుగురు మరణించగా, 16 మంది గాయపడ్డారు. వీరిలో అత్యధికులు కన్వర్ భక్తులని జిల్లా కలెక్టర్ అలంకృత పాండే తెలిపారు. దేవాలయంలోని భద్రతా సిబ్బంది సత్వరమే స్పందించి, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారని చెప్పారు.

రాకాసిని పారదోలారు

విద్యార్థుల విప్లవం ఇది: యూనస్

ఢాకా: బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న మహమ్మద్ యూనస్, ఆ దేశంలో విద్యార్థుల నిరసనలపై ప్రశంసలు కురిపించారు. మాజీ ప్రధాని షేక్ హసీనాను రాకాసితో పోల్చారు. 'విద్యార్థులు దేశంలో తెచ్చిన విప్లవంతో రాకాసిని పారదోలారు. మీరు (విద్యార్థులు) సాధించింది అసమాన్యమైంది. మీరంటే నాకెంతో గౌరవం. అందుకే మీ ఆదేశాలను పాటించా'అని యూనస్ అన్నారు. మరోవైపు, దేశం విడిచి వెళ్లిన మాజీ ప్రధాని షేక్ హసీనాను తిరిగి స్వదేశానికి రప్పించే ప్రయత్నం చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది.

అణువిద్యుత్తు కేంద్రంపై ఉక్రెయిన్ దాడి!

- జపోరిజియా ప్లాంట్‌లో తప్పిన పెను ప్రమాదం
- ప్రస్తుతం మూసేసి ఉన్న కేంద్రం
- రష్యానే దాడి చేసుకుందన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ
- ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రం

మాస్కో, ఆగస్టు 12: రష్యా - ఉక్రెయిన్ యుద్ధంలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. తమ నియంత్రణలోని జపోరిజియా అణువిద్యుత్తు కేంద్రంపై ఉక్రెయిన్ దాడి చేసిందని రష్యా ఆరోపించింది. కేంద్రంలోని కూలింగ్ వ్యవస్థ ఉన్న ప్రాంతంలో ఉక్రెయిన్ మానవరహిత వైమానిక వాహనం(యూఏవీ) ఆదివారం రాత్రి దాడి చేయడంతో మంటలు వ్యాపించినట్టు రష్యా విదేశాంగ శాఖ తెలిపింది. ఈ దాడికి పాల్పడి ఘోరమైన తప్పు చేసిన వారి పేరును ప్రకటించాల్సిందిగా అంతర్జాతీయ అణు శక్తి సంస్థ(ఐఏఈఏ)ను రష్యా పట్టుబట్టనున్నట్టు పేర్కొన్నది. కాగా, పలు పేలుళ్ల తర్వాత అణువిద్యుత్తు కేంద్రంలోని వాయవ్య ప్రాంతం నుంచి దట్టమ